సాక్షి నంద్యాల

గురువారం। 13। మార్చి। 2025



ఉల్లి రైతు కంట కన్నీరు!
కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రతి రోజు 20 నుంచి 30 వరకు ఉల్లి లాట్లకు టెండరు వేయడం లేదు. దీంతో రైతులు రోజుల తరబడి మార్కెట్‌లోనే ఉండాల్సి వస్తోంది. 8లో▸



జీవనశైలితో కిడ్నీ కుదేల్!
కిడ్నీలను ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా తీవ్ర నష్ట జరుగుతుంది. కొన్నిసార్లు ప్రాణాల మీదకు వస్తుంది. ఆరేళ్లలో కిడ్నీ రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 8లో▸

ఉష్ణోగ్రతలు

కనిష్టం	20.6
గరిష్టం	37.9

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:33	ఉ॥ 5:05
ఆదోని	సా॥ 6:32	ఉ॥ 5:06
నంద్యాల	సా॥ 6:29	ఉ॥ 5:05
ఆత్మకూరు	సా॥ 6:28	ఉ॥ 5:00
బనగానపల్లె	సా॥ 6:31	ఉ॥ 5:02

హదీస్ వెలుగు :
తప్పులు చేసేటప్పుడు చుట్టూ చూసి ఎవరూ చూడటం లేదని అనుకోవద్దు. పైన ఆకాశం నుంచి అల్లాహ్ ప్రతిదీ చూస్తూ ఉంటాడు.
- పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని 53 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయని డీఈఐవో సునీత తెలిపారు. బుధవారం రెండోసంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 12,285 మందికి గాను 11,932 మంది హాజరు కాగా 353 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు పరిచామన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పుట్టెడు దుఃఖంలో పరీక్ష



విద్యార్థిని పద్మావతి

ఆళ్లగడ్డ: కంటికి రెప్పలా కాపాడిన తండ్రి మృతి చెందడంతో ఆ విద్యార్థిని పుట్టెడు దుఃఖమే మిగిలింది. 'నాన్న ఇక రారని.. తనను బాగా చూసుకునే వారు ఎవరు' అని ఏడుస్తూనే ఆ బాలిక పరీక్ష కేంద్రానికి వచ్చారు. 'బాగా చదువుకోవాలి' అని తండ్రి చెప్పిన మాటలు గుర్తుచేసుకుంటూ పరీక్ష రాశారు. ఈ విషాదకర ఘటన బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలో చోటు చేసుకుంది. ఆళ్లగడ్డ బస్టాండు సమీపంలోని నాగేశ్వరరావు (48) కుమార్తె పద్మావతి.. స్థానిక వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. అనారోగ్యంతో నాగేశ్వరావు మంగళవారం రాత్రి మృతి చెందాడు. రాత్రంతా తండ్రి మృతదేహం వద్ద కన్నీటి పర్యంతమైన పద్మావతి బుధవారం ఉదయాన్నే పరీక్ష కేంద్రానికి హాజరయ్యారు. తండ్రిని గుర్తు చేసుకుంటూనే పరీక్షను పూర్తి చేశారు. అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

సెట్కూరు సీఈఓగా వేణుగోపాల్



కర్నూలు(హాస్పిటల్): జిల్లా యువజన సంక్షేమ శాఖ(సెట్కూరు) సీఈఓగా డాక్టర్ కె.వేణుగోపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన ఇన్‌ఛార్జి సీఈఓగా వ్యవహరిస్తున్న పి.దీప్తి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గతంలో కోవెలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించారు.

ఆదోని కేసులో పోసాని విడుదల

కర్నూలు: సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై ఆదోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో మంగళవారం బెయిల్ వచ్చిన విషయం విదితమే. బుధవారం కోర్టులో జామీను పత్రాలు దాఖలు చేసి విడుదల ఉత్తర్వులు జిల్లా జైలుకు చేరకముందే గుంటూరు నుంచి సీఐడీ పోలీసులు కర్నూలు చేరుకున్నారు. పిటీ వారెంటుపై మధ్యాహ్నం 12 గంటలకు కర్నూలు జిల్లా జైలు నుంచి పోసానిని తరలించనిట్లు జైలు అధికారులు పోసాని న్యాయవాదులకు తెలిపారు. ఆదోని కేసులో విడుదల ఉత్తర్వులు జైలు అధికారులకు అందించారు.



వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, నిరుద్యోగులు, విద్యార్థులు

యువత ఉద్యమ భేరి

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో యువత పోరు
- నంద్యాలలో విద్యార్థులు, నిరుద్యోగులతో భారీ ర్యాలీ
- ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్
- కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే ఊరుకోమని హెచ్చరిక
- జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన వైస్సార్‌సీపీ నేతలు

విద్యార్థులు, నిరుద్యోగులు భారీగా కదలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసంపై మండిపడ్డారు. 'సీఎం డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేస్తూ నంద్యాలలో కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని, లేదంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యువత ఆకాంక్షలను నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు



నంద్యాలలో కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ జెండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు

నంద్యాల: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'యువత పోరు' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో నిరుద్యోగులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. నంద్యాల పట్టణంలోని నూనెపల్లె నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు, విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేస్తున్న 'సీఎం డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, కాటసాని రామిరెడ్డి, నందికొట్కూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ధారా సుధీర్, ఏపీ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీనాగిరెడ్డి తదితరులు.. జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు వివరించి వినతి పత్రం అందజేశారు.

'సూపర్ సిక్స్' పేరుతో మోసం

విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు మోసం చేశారన్నారు. పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదువుకోవాలని ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని మరింత ఉన్నతంగా అమలు చేసి విద్యార్థులు చదువుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక చంద్రాబునాయుడు.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు.

ప్రైవేటుపరం చేయొద్దు

మాజీ ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. వైద్య విద్యను అందరికీ అందుబాటులోకి వచ్చే విధంగా 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేయించి ఐదు కళాశాలలను తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. నేడు నంద్యాలలో మెడికల్ కళాశాల ప్రారంభమై విద్యార్థులు అందులో విద్యను అభ్యసిస్తున్నారంటే వైఎస్ జగన్ చలువేనన్నారు. నేడు చంద్రబాబు ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయాలని చూస్తోందన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని పేదలకు వైద్య విద్యను అందుబాటులో ఉంచాలన్నారు.

మోసం చేశారు

శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే అమ్మ ఒడి, వసతి దీవెన పథకాలను కొనసాగిస్తామని చెప్పిన టీడీపీ నాయకులు ఇంకో ఒక అడుగు ముందుకు వేసి ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు రూ.15వేలు చొప్పున ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈ పాటికే వసతి దీవెన, అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు ప్రజలకు అందేవన్నారు. కూటమి ప్రభుత్వం పథకాల పేర్లు మార్చింది కాని ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు.

> **ఉద్యోగాలేవీ?**
>
> జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. నేడు రాష్ట్రంలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. డీఎస్సీపై మొదటి సంతకం చేసి 9నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకు హామీ ఇచ్చిన విధంగా నిరుద్యోగ భృతి రూ.3వేలు వెంటనే ఇవ్వాలన్నారు.

విద్యార్థులతో చెలగాటం

బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ.. రైతులు, మహిళలను మోసం చేసినట్లే నేడు విద్యార్థులు, నిరుద్యోగులను టీడీపీ అధినేత చంద్రబాబు మోసం చేస్తున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శించారు. వెంటనే ప్రభుత్వ ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు.

పేదల ఇళ్లు.. టీడీపీకేనా?

నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు ఒక్క పింఛన్ తప్ప ఏ పథకం అమలు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలను రద్దు చేసి టీడీపీ కార్యకర్తలకు ఇవ్వాలని చూడటం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు దేవుడెరుగు.. ఉన్న ఉద్యోగాలు తీసి వేసి వలంటీర్లను రోడ్లపై పడేశారన్నారు.

చిత్తశుద్ధి లేదు

ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగల బిజేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలకు ఇవ్వాల్సింది రూ.7100 కోట్లు అయితే బడ్జెట్‌లో రూ.2600 కోట్లు కేటాయించడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థులు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించాలన్నారు.

జాబ్ క్యాలెండర్ ఏదీ?

నందికొట్కూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ధారా సు. దీర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్సమెంట్ ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు పుస్తెలు తాకట్టు పెట్టి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రతి ఏడాది జనవరిలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి ఇప్పుడు అది అతీగతి లేదన్నారు.

- కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు దాల్‌మిల్ అమీర్, పాణ్యం సూర్యనారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా కిశోర్‌రెడ్డి, కల్లూరి రామలింగారెడ్డి, గంధం రాఘవరెడ్డి, డాక్టర్ శశికళారెడ్డి, రసూల్ ఆజాద్, మంజుల, శ్వేత, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు పోచా బ్రహ్మారెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి తదితరులు

ప్రజల జీవితాల్లో వెలుగు వైఎస్సార్‌సీపీ

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బొమ్మలసత్రం: ప్రజల జీవితాల్లో వెలుగు నింపి వారికి ఎల్లప్పుడూ అండగా నిలిచే పార్టీ వైఎస్సార్‌సీపీ అని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నంద్యాలలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గపు ఇన్‌చార్జ్ సుధీర్‌కుమార్.. పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనాకాలంలో కులమతాలకు అతీతంగా, పార్టీలకు సంబంధం లేకుండా అర్హత కలిగిన ప్రతి పేదవారికి పథకాలు అందజేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి.. ప్రజలను ఎలా వంచిస్తున్నారో అందరూ గమనిస్తున్నారన్నారు. 'కూటమి' నేతలకు రానున్న రోజుల్లో ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారన్నారు. పేద విద్యార్థుల మెడికల్ విద్య కల సాకారానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 17 కొత్త కాలేజీలు తీసుకొస్తే ఆ కాలేజీలను నిర్వీర్యం చేయాలని కూటమి ప్రభుత్వం చూడటం అవివేకమన్నారు. సీనియర్ నేత కల్లూరి రామలింగారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలీ, రాష్ట్ర మహిళా జోనల్ ప్రసిడెంట్ శ్వేతారెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు డాక్టర్ శశికళారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కొతాళం: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఎరిగేరి పంచాయతీ మజరా గ్రామమైన లక్ష్మీనగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. లక్ష్మీనగర్‌కు చెందిన బైటిగేరి ఉలిగప్ప(60) తనకున్న రెండు ఎకరాల సొంత పొలంతో పాటు మరో 8 ఎకరాలను కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశాడు. పంట పెట్టుబడి కోసం రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. ఈ ఏడాది మిరప పంటకు గిట్టుబాటు ధర లేక పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి అధికమైంది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంటలకు తెచ్చుకున్న పురుగు మందును తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఆరుగురు ఆడపిల్లలు సంతానం. భార్య ఆనందమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొతాళం ఏఎస్ఐ రమణరెడ్డి కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పెన్షన్ రీ వెరిఫికేషన్ షెడ్యూల్ మార్పు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సదరంలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ రీ వెరిఫికేషన్ షెడ్యూల్ మార్పు చేసినట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో సోమ, మంగళవారాల్లో ఓపీ రోగులు అధికంగా వస్తున్నందున ఉన్నతాధికారుల సూచన మేరకు పెన్షన్‌ల రీ వెరిఫికేషన్ ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో నిర్వహించేలా మార్పులు చేశామన్నారు. రీ వెరిఫికేషన్‌కు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్ తీసుకురావాలని పేర్కొన్నారు.

కల్యాణ వైభోగమే..

- నయనానందకరం శ్రీ ప్రహ్లాదవరదుడి కల్యాణం
- పరవశించిన భక్తజనం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పీఠాధిపతి, అర్చకులు

ఆళ్లగడ్డ: సకల కల్యాణ గుణ పరిపూర్ణుడైన దేవదేవుడు వరదహస్తుడై ఆశీర్వదించిన వేళ.. స్వామివారి కరుణా కటాక్ష వీక్షణాలకై భక్తజనం పోటెత్తిన సమయాన.. వేదమంత్రోచ్చారణల నడుమ దిక్కులు పిక్కటిల్లేలా 'ఉగ్రం వీరం మహావిష్ణుం.. ఓం నమో నారసింహాయ' అంటూ నామస్మరణలు విన్నంటిన శుభ సమాయాన.. విద్వాంసుల సొంపైన మంగళ వాయిద్యాలతో జరిగిన జగత్కల్యాణం అందర్నీ ఆనందపారవశ్యంతో ముంచెత్తింది. ఆ అపూర్వ ఘట్టం బుధవారం రాత్రి భక్తకోటి హృదాయాల్లో ఆధ్యాత్మిక వైభవాన్ని నింపింది.. నల్లమల పులకించింది.. శ్రీ లక్ష్మీనరసింహ స్వాముల తిరుకల్యాణ మహా ఘట్టాన్ని చూసిన భక్తుల హృదయం పరవశించింది.

కనుల పండువగా..

అహోబిల పుణ్యక్షేత్రంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి వారి మహాద్భుత పరిణయోత్సవం కనుల పండువగా సాగింది. ముందుగా వేద పండితులు పుణ్యాహవచనం చేసి నవగ్రహ మంటపారాధన అనంతరం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సమర్పించిన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవార్లను పెండ్లి కూతురు, పెండ్లి కుమారులుగా అలంకరించారు. ఇరువురిని విడివిడిగా పల్లకీలో కొలువుంచి ఊరేగింపుగా పెండ్లి మంటపానికి తోడ్కొని వచ్చి పెళ్లి పీటలపై కొలువుంచారు. ఎదుర్కోల్లు నిర్వహించిన అనంతరం వైష్ణవ ఆచారంగా వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో కల్యాణాన్ని జరిపించారు. యజ్ఞధారణ, జీలకర్ర బెల్లం తతంగాలు చేపట్టాక మాంగళ్య ధారణ నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు కార్యక్రమం పూర్తి చేశారు. స్వామి, అమ్మవారి మీద నుంచి కింద పడ్డ తలంబ్రాలను భక్తులకు పంచి పెట్టారు. ముఖ్య అతిథిలుగా (పెళ్లి పెద్దలుగా) పాల్గొన్న భక్తులకు అర్చకులు కంకణ ధారణ చేశారు.



కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

ఆకట్టుకున్న ఎదుర్కోలు ఉత్సవం

అలంకరించిన స్వామి, అమ్మవారిని వేర్వేరు పల్లకీల్లో కొలువుంచి పెళ్లి మండపానికి తో డ్కొని వచ్చే ముందు ఎదుర్కోలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్వామి తరపున కొందరు, అమ్మవారి తరపున కొందరు అర్చకులు బంధుగుణంగా విడిపోయి పెద్ద మనుషులుగా వ్యవహరిస్తారు. కట్నకానుకలు, ఆడపడుచు లాంఛనాలు, ఇచ్చి పుచ్చుకోవడం తదితర విషయాలు చర్చించుకుంటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుకునే మాటలు అలరించాయి.

పలువురు సీఐలకు స్థానచలనం

కర్నూలు: పోలీసు శాఖలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పలువురు సీఐలకు స్థానచలనం కలిగింది. కర్నూలు రేంజ్ పరిధిలో 20 మందిని బదిలీ చేస్తూ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో నలుగురు సీఐలను వివిధ స్థానాలకు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న ముగ్గురు సీఐలకు పోస్టింగులు దక్కాయి. గోనెగండ్ల సీఐ గంగాధర్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బదిలీ అయిన సీఐలు

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జీవీ చలపతి	ఆలూరు	రాయచోటి యూపీఎస్ (అన్నమయ్య జిల్లా)
శంకర్ మల్లయ్య	ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు	మహిళా పీఎస్ (అన్నమయ్య)
ఓ.మహేశ్వర రెడ్డి	వీఆర్, కర్నూలు	ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు
రాజశేఖర్‌రెడ్డి	వీఆర్, అనంతపురం	ఆదోని టూటౌన్
విజయభాస్కర్	వీఆర్, నంద్యాల	గోనెగండ్ల
గంగాధర్	గోనెగండ్ల	వీఆర్, కర్నూలు
పి.చంద్రశేఖర్	రాయచోటి యూపీఎస్ (అన్నమయ్య జిల్లా)	వీఆర్, కర్నూలు

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్):బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు (బలిజ) కులాలకు చెందిన మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్‌హుసేన్ తెలిపారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు మహిళలందరు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన బుధవారం ఒక ప్రకటన లో వెల్లడించారు. శిక్షణ అనంతరం ఉచితంగా కట్టు మిషన్లు కూడా ఇస్తామ ని చెప్పారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 22వ తేదీ వరకు సచివాలయాలు, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకోవాలని సూచించారు.

వేటగాళ్ల ఉచ్చుకు దుప్పి బలి



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్‌లో వేటగాళ్ల దురాగతాలకు అంతులేకుండా పోతోంది. బుధవారం బైర్లూటీ రేంజ్‌లోని పెద్దఅనంతాపురం సెక్షన్ అటవీ ప్రాంతంలో ఏకంగా వర్లుపోతుగా పిలిచే ఒక భారీ మగ దుప్పిని ఉచ్చులు వేసి చంపేశారు. సుమారు 60 కేజీలకు పైగానే బరువు ఉండే దుప్పి మాంసాన్ని నిల్వ చేసేందుకు ఎండ బెట్టారు. దుప్పి వధ సమాచారం తెలిసి బుధవారం అటవీ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లగా వేటగాళ్లు అక్కడి నుంచి పరారయ్యారు. అటవీ అధికారులు అక్కడ ఉన్న మాంసాన్ని స్వాధీనం చేసుకుని దుప్పి వధపై పీఓఆర్ నమోదు చేసి వేటగాళ్ల కోసం గాలింపు చేపట్టారు. నిందితులను తప్పక అదుపులోకి తీసుకుని కఠిన శిక్ష పడేలా చేస్తామని రేంజర్ కృష్ణ ప్రసాద్ తెలిపారు.

జీవనశైలితో కిడ్నీ కుదేల్!

- పెరుగుతున్న కిడ్నీ వ్యాధి బాధితులు
- 10 నుంచి 17 శాతానికి పెరిగిన రోగుల సంఖ్య
- బీపీ, షుగర్‌తోనే కిడ్నీకి ఇబ్బంది
- కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి నెలా 1300 మందికి డయాలసిస్
- 30 ఏళ్ల లోపు బీపీ వస్తే కిడ్నీ సమస్యలు ఉన్నట్లు అనుమానం
- నేడు వరల్డ్ కిడ్నీ డే

మానవశరీరంలో గుప్పెడంత పరిమాణంలో ఉండే కిడ్నీలు రక్తాన్ని వడపోసి, మలిన పదార్థాలను వేరుచేసి వాటిని మూత్రం ద్వారా విసర్జిస్తాయి. దేహంలో నీటి శాతాన్ని అవసరమైన పరిమాణంలో క్రమబద్ధంగా ఉంచి ఎక్కువైన నీటిని బయటకు పంపిస్తాయి. లవణ పరిమాణాన్ని, రక్తపోటును క్రమబద్ధీకరిస్తాయి. ఇలా మనిషి ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలకపాత్ర పోషించే ఈ అవయవం పనితీరు మందగించి అది విఫలమవ్వడం ఆరంభమైతే దానిని పూర్తిగా నయం చేయడం కష్టం. అయితే, ప్రస్తుతం మారిన మనిషి జీవన శైలి ఆ పరిస్థితిని తీసుకొస్తుంది. అవగాహన లేమితో కిడ్నీ సంబంధ వ్యాధులు పెరిగిపోతున్నాయి. నేడు వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా ప్రత్యేకం కథనం.


కర్నూలు(హాస్పిటల్): నిరంతరం పనిచేసే కిడ్నీలను జాగ్రత్తగా కాపాడుకోవాలి, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా తీవ్ర నష్ట జరుగుతుంది. కొన్నిసార్లు ప్రాణాల మీదకు వస్తుంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని నెఫ్రాలజీ విభాగంలో ప్రతి వారం సోమ నుంచి శుక్రవారం వరకు ఓపీ చూస్తారు. ఇక్కడ గత జనవరి నెల 665 ఓపీ, 138 ఐపీ, ఫిబ్రవరిలో 450 ఓపీ, 137 ఐపీ రోగులు చేరి చికిత్స పొందారు. ఈ విభాగంలో సగటున ప్రతి నెలా 1300 మంది దాకా కిడ్నీ బాధితులకు డయాలసిస్ చేస్తున్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు నలుగురికి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించి విజయవంతం చేశారు. ఈ ఆసుపత్రితో పాటు నగరంలోని పలు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ(వైద్య సేవ) ద్వారా ఉచితంగా డయాలసిస్, పలు రకాల ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తున్నారు.

పిల్లలు, పెద్దల్లో కిడ్నీ వ్యాధులు

చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చే జన్యుపరమైన వ్యాధులు, ఇన్‌ఫెక్షన్ వల్ల మూత్రపిండాల వ్యాధులు కలుగుతాయి. పుట్టుకతో వచ్చే జన్యుపరమైన వ్యాధుల వల్ల పిల్లలు ఎదుగుదల లేకపోవడం, మూత్రం ఎక్కువగా, తక్కువగా పోవడం, కాళ్లు, చేతులు వంకర్లు పోవడం వంటివి జరుగుతాయి. ఇన్‌ఫెక్షన్‌తో వచ్చే వ్యాధుల వల్ల పిల్లలకు మూత్రం ఎరుపు రంగులో రావడం, కాళ్లవాపులు రావడం, ఒళ్లు దద్దుర్లు రావడం వంటివి జరుగుతాయి. పెద్దల్లో రక్తపోటు, మధుమేహం, మూత్రపిండాల ఇన్‌ఫెక్షన్ వల్ల సాధారణంగా మూత్రపిండాలు చెడిపోతాయి. ఈ వ్యాధులు ఉన్న వాళ్లు మూత్రపిండాల వైద్యుల పర్యవేక్షణలో ఉండటం మంచిది.

కిడ్నీలు పాడయ్యేందుకు కారణాలు

బీపీ, షుగర్, ఉబ్బు కామెర్లు, అధిక మొత్తంలో నొప్పుల మాత్రలు వాడటం, కిడ్నీల్లో రాళ్లు, జన్యుపరంగా పుట్టుకతో వచ్చే వ్యాధులు, మూత్ర కోశ, మూత్రనాళ వ్యాధులు, వాంతులు, విరేచనాలు, పాముకాటు, మలేరియా, పచ్చకామెర్లు, లెప్టోస్పైరా, గర్భం సమయంలో మూత్రం ఇన్‌ఫెక్షన్, రక్తపోటు రావడం వల్ల కిడ్నీలు దెబ్బతింటాయి.





పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న కిడ్నీ బాధితులు

కిడ్నీ జబ్బుల లక్షణాలు

నిస్సత్తువ, వాంతి వచ్చినట్లు ఉండటం, ఆకలి లేక పోవడం, దురద, ఒళ్లునొప్పులు, మూత్రం ఎక్కువగా పోవడం, అతి తక్కువగా పోవడం, రాత్రిపూట మూత్రం ఎక్కువగా పోవడం, శరీర వాపు, చిన్నపిల్లల్లో మూత్రం ఎర్రగా రావడం, ఒళ్లు దద్దుర్లు, చిన్నపిల్లల్లో ఎదుగుదల లేకపోవడం, కాళ్లు వంకరలు పోవడం, అధిక రక్తపోటు.

ఆరేళ్లలో కిడ్నీ రోగుల వివరాలు

సంవత్సరం	ఓపీ రోగుల సంఖ్య	ఐపీ రోగుల సంఖ్య
2019	9,034	1,830
2020	2,640	630
2021	1,546	1,010
2022	5,228	1,337
2023	5,575	1,493
2024	6,943	1,771

వ్యాధి లక్షణాలను బట్టి చికిత్స



మూత్రపిండాలకు వచ్చిన వ్యాధి లక్షణాలు, దాని తీవ్రతను బట్టి వైద్యులు రకరకాల చికిత్సలను చేయాల్సిన అవసరం ఉంటుంది. కొన్ని వ్యాధులు ఆహార నియమావళి పాటించి మందులు తీసుకుని తగ్గించుకోవచ్చు. కొన్ని వ్యాధుల్లో డయాలసిస్, కిడ్నీ మార్పిడి అవసరం రావచ్చు.

–డాక్టర్ ఎం. శ్రీధరశర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్, నెఫ్రాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

మూత్ర సమస్యలుంటే నిర్లక్ష్యం చేయొద్దు



చాలా మంది మూత్రసమస్యలను నిర్లక్ష్యం చేస్తుంటారు. కొన్నిసార్లు అవి సాధారణమే అయినా ఒక్కోసారి అది ప్రాణాంతకమైన ఆరోగ్య సమస్యగా మారుతుంది. ముఖం ఉబ్బరం, మూత్రం పోయినప్పుడు చురుకు, మంట, ఎరుపు రంగులో మూత్రం రావడం, మూత్రం సరిగ్గా రాకపోవడం, మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం, చిన్న వయస్సులోనే రక్తపోటు లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

–డాక్టర్ పీఎల్. వెంకట పక్కిరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, నెఫ్రాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

నేడు వైద్యవిజ్ఞాన సదస్సు



అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నాము. లూపస్ నెఫ్రైటిస్ కరెంట్ ట్రీట్‌మెంట్ అండ్ వే ఫార్వర్డ్ అనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన సీనియర్ నెఫ్రాలజిస్టు డాక్టర్ ఎ. శశికిరణ్ ప్రసంగిస్తారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభిస్తారు.

–డాక్టర్ ఎస్. అనంత్, ఇన్‌చార్జ్ హెచ్ఓడీ, నెఫ్రాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

ఇళ్ల నిర్మాణాలకు అదనపు ఆర్థిక సాయం

కర్నూలు(సెంట్రల్): ఎన్టీఆర్ కాలనీల్లో(జగనన్న కాలనీలు) నిర్మాణాల్లోని ఇళ్లకు అదనంగా ఆర్థిక సాయం మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. 2024 డిసెంబర్ 10వ తేదీ నాటికి నిర్మాణంలో ఉండి మధ్యలో నిలిచిపోయిన ఇళ్లకు అదనపు సాయం వర్తిస్తుందన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు ప్ర స్తుతం రూ.1.80 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్ర స్తుతం ఈ మొత్తానికి అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు మంజూరవుతుందన్నారు. జిల్లాకు గత ప్రభుత్వంలో 39 వేల గృహాలు మంజూరు కాగా, 22,590 గృహాలు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు.ఇళ్లు లేని వారికి పట్టణా ల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలాలను ఇచ్చేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, ఇప్పటి వరకు జిల్లాలో 39 వేల అర్జీలు వచ్చినట్లు తెలిపారు. విలేకరుల సమావేశ ంలో హౌసింగ్ పీడీ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు కార్డుతో ప్రయోజనాలు



మాట్లాడుతున్న మురళీకృష్ణ

నంద్యాల(అర్బన్): భూమి గల ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డు పొందితే ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతాయని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలో బుధవారం ఏఓ ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ, యాంత్రికీకరణ పరికరాలు మంజూరు చేసిందన్నారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏడీఏ రాజశేఖర్, ఏఈఓ మనోహర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది కిరణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో 10వ తరగతి విద్యార్థులు

ఆత్మీయ వీడ్కోలు

వీరంతా మండలకేంద్రం దొర్నిపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులు. ఈనెల 17 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 9వతరగతి విద్యార్థులు వారికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇన్నాళ్లు ఒకే పాఠశాలలో కలిసిమెలసి చదువుకొని బయటకు వెళ్లిపోతుండటంతో కళ్లలో నుంచి ఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుతూ నేస్తమా మళ్లీ కలుద్దామంటూ ఒకరినొకరు కరచాలనం, ఆలింగనం చేసుకున్నారు. గుర్తుగా ఉపాధ్యాయులతో కలిసి ఫొటో దిగారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆకాంక్షిస్తూ విద్యార్థులకు ఆల్‌దిబెస్ట్ చెప్పారు.

– దొర్నిపాడు

వాహనాల వేలం ద్వారా రూ.5.77 లక్షల ఆదాయం

కర్నూలు: వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను కర్నూలు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం వేలం వేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, సీఐ చంద్రహాస్ ఆధ్వర్యంలో 24 వాహనాలను వేలం వేయగా పలువురు పోటీపడి 17 వాహనాలను కొనుగోలు చేశారు. తద్వారా ప్రభుత్వానికి రూ.5.77 లక్షల ఆదాయం సమకూరింది. 18 శాతం జీఎస్టీతో కలిపి నగదు చెల్లించిన వారికి వాహనాలను అందజేశారు. మిగిలిన మరో ఏడు వాహనాలను తేదీ ప్రకటించి మరోసారి వేలం వేయనున్నట్లు సీఐ తెలిపారు.

24 గంటల్లో భవన నిర్మాణాలకు అనుమతులు

- టౌన్ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్

కర్నూలు (టౌన్): పట్టణాల్లో భవనాల అనుమతులకు సంబంధించి 24 గంటల వ్యవధిలో అనుమతులు మంజూరు చేస్తున్నట్లు టౌన్ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక నగర పాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో జిల్లాలోని మున్సిపాల్టీల పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, లైసెన్సు ఇంజినీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణాలకు అనుమతుల్లో జాప్యాన్ని నిరోధిస్తూ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. దీని ప్రకారం దరఖాస్తును పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన గంటల వ్యవధిలోనే అనుమతులు పొంది పనులు ప్రారంభించవచ్చన్నారు. అక్యుపెన్సీ సర్టిఫికెట్ సైతం పొందవచ్చని చెప్పారు. అయితే, నిర్మాణానికి సర్వే రిపోర్టు, స్థలం విలువ ఆధారిత సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆకస్మిక తనిఖీల్లో అనుమతులను రద్దు చేస్తామన్నారు. టెక్నికల్ పర్సన్లు తప్పులు చేస్తే వారి లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ శోభన్ బాబు, డీటీసీపీ శశిలత, నంద్యాల అసిస్టెంట్ సిటీ ప్లానర్ మూర్తి, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ అధికారులు ఎల్‌టీపీలు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రాంతీయ టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్

యాపదిన్నె సర్పంచ్‌పై కేసు నమోదు

డోన్ టౌన్: డోన్ మండలం యాపదిన్నె గ్రామానికి చెందిన తెలుగుదేశం సర్పంచ్ రామిరెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదైంది. వాటర్ షెడ్ పనుల్లో తనకు ప్రాధాన్యత ఎందుకు ఇవ్వరని మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వాటర్ షెడ్ ఏపీఓ విజేత,ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి విధులకు ఆటంకం కల్గించి అసభ్య పదజాలంతో దూషించిన విషయం తెలిసిందే. దీనిపై సదరు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామిరెడ్డిపై కేసు నమోదు చేసి చేసి రిమాండ్‌కు పంపతున్నట్లు బుధవారం సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన వేణుగోపాల్

అవుకు: మండల పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతంచర్ల మండలం బలపాలపల్లె గ్రామానికి చెందిన చిన్న తిమ్మిగాళ్ల వేణుగోపాల్ (37) భార్యాపిల్లలతో సహా గత రెండేళ్లుగా అవుకులో నివాసం ఉంటూ గౌండ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం చెన్నంపల్లె గ్రామంలో ఓ ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబ్‌ను కూలుస్తుండగా ప్రమాదవశాత్తు పైన ఉన్న కరెంట్ తీగలు తగిలి కిందపడ్డాడు. దీంతో 108 అంబులెన్స్ ఈఎంటీ జనార్దన్ రెడ్డి అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య చిన్న తిమ్మగాళ్ల ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ క్రిష్ణయ్య తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు సంతానం.

రంగాపురం జెడ్పీ హైస్కూలు విద్యార్థిని ఆత్మహత్య



మధులత (ఫైల్)

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూల్లో 10 వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు గ్రామానికి చెందిన తిరుమలేశ్వరరెడ్డి, లావణ్య దంపతుల పెద్ద కుమార్తె మధు లత(15) గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో 10వ తరగతి చదువుతోంది. కుటుంబ సమస్యలో మరే కారణం చేతనో ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో బుధవారం ఉదయం ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బయటకు వెళ్లిన తల్లి లావణ్య ఇంటికి వచ్చి చూసి వెంటనే వేలాడుతున్న కుమార్తెను కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. మరో 5 రోజుల్లో పబ్లిక్ పరీక్షలకు హాజరు కావలసిన విద్యార్థిని మృతి పట్ల తోటి విద్యార్థులు కన్నీరు, మున్నీరుగా విలపించారు. హెచ్‌ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

సాధారణ కాన్పులో బాలభీముడు జననం



కోడుమూరు రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఓ మహిళకు సాధారణ కాన్పులో 4.25 కిలోల బరువు గల పండంటి మగ శిశువు మంగళవారం రాత్రి జన్మించాడు. కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన సులోచన ప్రసవ నొప్పులతో మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. ఆరోగ్య పరీక్షలు చేసిన గైనకాలజిస్ట్ పుష్పలత సాధారణ కాన్పు చేశారు. సహజంగా అప్పుడే పుట్టిన పిల్లలు రెండున్నర కిలోల నుంచి మూడున్నర కిలోల బరువు ఉంటారని ఈ బిడ్డ 4.25 కిలోలు ఉండటం అది కూడా సాధారణ కాన్పులో జన్మించడం విశేషమని వైద్యాధికారి డా.నాగరాజు తెలిపారు. సులోచనకు ఇది నాలుగో కాన్పు. అన్ని కూడా నార్మల్ డెలివరీలు కావడం గమనార్హం. ముగ్గురు అమ్మాయిల తర్వాత కుమారుడు జన్మించడం పట్ల సులోచన, నారాయణ దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.

క్రీడలపై కూటమి నేతల దుష్ప్రచారం సిగ్గుచేటు



విలేకరులతో మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో ఒకరేమో రూ.300 కోట్ల స్కామ్ అంటారు, మరొకరేమో రూ.400 కోట్ల స్కామ్ అని నోటికొచ్చినట్లు మాట్లాడటం చూస్తే వాళ్ల ఆరోపణల్లో నిజం లేదనే విషయం తెలుస్తోందని రాష్ట్ర శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. బుధవారం ఆయన నంద్యాల జిల్లా నందికొట్కూరులో విలేకరులు అడిగిన ప్రశ్నలకు పైవిధంగా సమాధానమిచ్చారు. తెలుగు దేశం పార్టీ ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు నోటికి వచ్చినట్లు ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో స్కామ్ జరిగినట్లు దుష్ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. క్రీడల శాఖ మంత్రి ఆడుదాం ఆంధ్రకు బడ్జెట్‌లో రూ.119 కోట్లు కేటాయించినట్లు అసెంబ్లీలో చెబుతుంటే ఆరోపణలు చేసే వారికి వినిపించకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రమంతా చంద్రబాబు, భువనేశ్వరి కన్నీటితో ప్రచారం చేసి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చి పది నెలలైనా మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదన్నారు. నాలుగేళ్ల వరకూ జగనన్న పాలనపై ఇదే విమర్శలు చేసుకుంటూ ఒక్కపథకం కూడా అమలు చేయకుండా కాలం గడపటమే చంద్రబాబు నైజమన్నారు. రైతు భరోసా, తల్లికి వందనం ఇవ్వాలని ప్రజలు అడుగుతుంటే ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమంగా కేసులు బనాయించడం తగదని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15వేల సచివాలయాలకు రూ.38 కోట్లతో క్రీడా కిట్లను పంపిణీ చేశామని గుర్తు చేశారు. గత జగనన్న పాలనలో సచివాలయాలలో 1.30 లక్షల ఉద్యోగాలు ఇస్తే కూటమి నేతలకు కనిపించకపోవడం విడ్డూరమన్నారు.

అగ్నివీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు చెందిన అభ్యర్థులు అగ్నివీర్ పోస్టుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీసు డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీల అగ్నివీర్ల నియామకాల కోసం www.joinindianarmy.nic.in లో పేర్లను 2025 ఏప్రిల్ 10వతేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీఈఈ)ను మొట్టమొదటి సారిగా తెలుగుతో సహా 13 వేర్వేరు భాషల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనంగా 1.6 కిలోమీటర్ల పరుగు సమయాన్ని 06 నిమిషాల 15 సెకన్లకు పెంచినట్లు చెప్పారు. అన్ని కేటగిరీలకు సంబంధించి ఎన్‌సీసీ ఏ, బీ,సీ సర్టిఫికెట్ కలిగిన వారికి, ప్రతిభావంతులైన క్రీడాకారులకు, అగ్ని వీర్ టెక్నికల్ కేటగిరీ కోసం ఐటీఐ/డిప్లమో అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కర్నూలు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తి కలిగిన అభ్యర్థులందరూ అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ కార్యాలయ సహాయకులు/స్టోర్‌కీపర్ టెక్నికల్, అగ్నివీర్ వృత్తి నిపుణుల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉంటుందని, సైన్యంలో నియామకాల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

రేపటి నుంచి జాబ్‌మేళాలు

కర్నూలు(అగ్రికల్చర్): సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంటు జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంటు ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ద్వారా ఈ నెల 14 నుంచి జాబ్‌మేళా నిర్వహించేందుకు షెడ్యూలు ఖరారు చేసినట్లుగా ఏపీస్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎంఎఫ్‌సీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సబీహాపర్వీన్ తెలిపారు.ఈ నెల 14న కోడుమూరు (ప్రభుత్వ జూనియర్ కాలేజీ), బనగానపల్లి మండలం యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, నంద్యాల (పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ కాలేజీ)ల్లో జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు. 18న కర్నూలు సిల్వర్‌జుబ్లీ కాలేజీ, పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి న్యాక్ ట్రైనింగ్ సెంటరు, శ్రీశైలం (ప్రభుత్వ డిగ్రీ కళాశాల), డోన్ ఐటీఐ, 28న మంత్రాలయం, పత్తికొండ, డోన్, ఆదోనిలలో జాబ్ మేళాలు జరుగుతాయని తెలిపారు. మైనార్టీ వర్గాలకు చెందిన యువత ఈ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉల్లి రైతు కంట కన్నీరు!

మార్కెట్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం

- కొన్ని లాట్‌లకు ధర కోట్ చేయని వైనం
- నాణ్యత సాకుగా చూపి అన్యాయం
- విధిలేక ఎంతోకొంతకు అమ్ముకుంటున్న రైతులు



కర్నూలు(అగ్రికల్చర్): పంట దిగుబడులను గిట్టుబాటు ధరతో అమ్ముకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి రైతులు వ్యయ ప్రయాసలకోర్చి కర్నూలు మార్కెట్‌కు చేరుకుంటున్నారు. సరుకు మార్కెట్‌లోకి ప్రవేశించే సమయంలోనే లాట్ నెంబర్ అలాట్ అవుతుంది. పంట నాణ్యతను బట్టి వ్యాపారులు ఈ–నామ్‌లో ఆన్‌లైన్ టెండరు ద్వారా ఏదో ఒక ధర కోట్ చేయాల్సి ఉంది. ఎక్కువ ధర కోట్ చేసిన వారికి ఆ లాట్ దక్కుతుంది. రైతు ఆ ధరకు ఇవ్వచ్చు, ఇవ్వకపోవచ్చు. మరుసటి రోజు మళ్లీ టెండరుకు పెట్టుకోవచ్చు. కానీ మార్కెట్‌లో కొన్ని లాట్‌లకు వ్యాపారులు అస్సలు టెండరు వేయరు. ప్రధానంగా ఉల్లిగడ్డల విషయంలో ప్రతి రోజు 20 నుంచి 30 లాట్లకు వ్యాపారులు టెండరు వేయని పరిస్థితి. ఈ కారణంగా రైతులు రోజుల తరబడి మార్కెట్‌లోనే ఉండాల్సి వస్తోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి కొన్ని లాట్లకు ధర కోట్ చేయరనే ప్రచారం జరుగుతోంది. టెండరు వేయకపోతే రైతు లు ఏదో ఒక ధరకు అమ్ముకుంటారని, అప్పుడు నాణ్యత బాగోలేదని చెబితే తక్కువ ధరతో లాట్‌ను దక్కించుకోవచ్చనే కుట్ర కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి రోజు 20 నుంచి 30 మంది రైతులు అనామతుపై నామమాత్రపు ధరకు అమ్ముకొని కన్నీళ్లతో ఇంటిముఖం పడుతుండటం గమనార్హం.

మూడు రోజులైనా కొనే దిక్కులేదు



ఈ నెల 9న రాత్రి 100 ప్యాకెట్ల ఉల్లిని కర్నూలు మార్కెట్‌కు తీసుకొచ్చాం. నాణ్యత కూడా బాగుంది. సోమవారం టెండరుకు పెట్టారు. వ్యాపారులెవ్వరూ టెండరు వేయలేదు. మంగళవారం కూడా టెండరుకు పెట్టారు. అయినా వ్యాపారులు స్పందించలేదు. మార్కెట్‌కు ఉల్లి గడ్డలు తీసుకరావడానికి దాదాపు రూ.7వేల నుంచి రూ.8వేలు ఖర్చయింది. వెనక్కి తీసుకపోవాలంటే మళ్లీ అదే స్థాయిలో ఖర్చు వస్తుంది. టెండరు వేయకపోతే అనామతుపై అతి తక్కువ ధరకు విక్రయించుకోవాల్సిందే.

– దేవేంద్ర ఆచారి, గువ్వలదొడ్డి గ్రామం, ఎమ్మిగనూరు మండలం

మార్కెట్‌లో రైతులకు తీరని అన్యాయం



ఎకరాకు రూ.30 వేల వరకు ఖర్చు పెట్టి ఉల్లి సాగు చేశాం. 60 ప్యాకెట్ల దిగుబడి వచ్చింది. ఎంతో వ్యయ ప్రయాసలతో కర్నూలు మార్కెట్‌కు తీసుకొచ్చి మంగళవారం టెండరుకు పెట్టాం. ఉల్లి నాణ్యత సంతృప్తికరంగానేనే ఉంది. కానీ వ్యాపారులు టెండరు వేయలేదు. అలాగని సరుకును వెనక్కు తీసుకుపోలేం. మార్కెట్‌లో రైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. ఏదో ఒక ధరకు అమ్ముకుపోయే పరిస్థితి కల్పిస్తున్నారు.

– సుంకులమ్మ, చిట్యాల గ్రామం, క్రిష్ణగిరి మండలం